'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

- దరఖాస్తు ఫారానికి రూ.20
- జిరాక్స్ సెంటర్లలో ఎగబడ్డ జనం

సాక్షి, నెట్‌వర్క్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం జనం ఎగ బడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, జిరాక్స్ సెంటర్లలో జనం కిక్కిరిసి పోయారు. సమయం తక్కువగా ఉండడంతో ప్రజలు దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చారు. కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం తహ సీల్దార్ కార్యాలయం, మీసేవా కేంద్రాల వద్ద గుంపులుగా కనిపించారు. వచ్చిందే లాభం అంటూ జిరాక్స్ కాపీ రూ. 3 వసూలు చేశారు. సెల్‌ఫోన్‌ల నుంచి డౌన్‌లోడ్ చేస్తే రూ.10 ఒక కాపీ తీశారు. దరఖాస్తు ఫారం ఏకంగా రూ.20కి విక్రయించారు.

◆ దేవరకద్ర మండల పరిషత్‌కు బుధవారం 1,289 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.


భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో గుమిగూడిన ప్రజలు

◆ అడ్డాకులలో 618, మూసాపేటలో 640 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

◆ మహమ్మదాబాద్ 630, గండీడ్ 1,026 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

◆ హన్వాడలో రెండో రోజు ఏకంగా 2,500 దరఖాస్తులు వచ్చాయి.

జిల్లా క్లబ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ క్లబ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. క్లబ్ ఆధునీకీకరణ కోసం నిధులు కేటాయించాలని క్లబ్ కార్యవర్గ సభ్యులు మంత్రిని కోరగా, రూ.1.50 కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్లబ్ వద్ద చేపడుతున్న పనులను బుధవారం ఆయన క్లబ్ పాలకవర్గంతో కలిసి పరిశీలించారు. కుటుంబ సమేతంగా సభ్యులంతా వచ్చేలా నిర్వహణ ఉండాలని సూచించారు. అందరికీ ఆహ్లాదం పంచేలా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంఘ వ్యతిరేక శక్తులకు క్లబ్‌లో సభ్యత్వం ఇవ్వకూడదని తెలిపారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జిల్లా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్ కుమార్, మల్లు నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి


రోడ్డుపై బొడ్డెమ్మ వేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాకం రామ్మోహన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం క్లాక్‌టవర్ చౌరస్తాలో ఏఎన్‌ఎంలు బొడ్డెమ్మలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న వీరిని కాదని కొత్తగా ఏఎన్‌ఎంల భర్తీ కోసం నోటిఫికేషన్ వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జయమ్మ, శ్రీదేవి, మంజుల, రాణి, రాములమ్మ, సునీత, అలివేలు, గౌరి, రాములు, నర్సింహులు, తిరుపతయ్య, శ్రీనివాసులు, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులు కదలిరండి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్‌కు ఉద్యోగులు కదలిరావాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులను కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 12వ తేది ఉదయం 11 గంటలకు జెడ్పీ మైదానం వద్ద బస్సులను ఏర్పాటు చేశామని, సమయానికి ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గో ఆధారిత వ్యవసాయం ఆరోగ్యకరం


జడ్చర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: గో ఆధారిత వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించే పరిస్థితి ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం విపరీతమైన రసాయనాలు, ఎరువులను వినియోగించి వ్యవసాయం చేయడం వలన ఓ వైపు భూములు నిస్సారంగా మారడం, మరో వైపు పంటలు కూడా రసాయన మిళితంగా తయారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆరోగ్యంగా ఉండలేని పరిస్థితులు ఉంటున్నాయన్నారు. ప్రజలను చైతన్య పరచడంతో కోసం గో మహా పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ

సీఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత ఆర్టీసీ బస్సు పాస్‌లను ఎమ్మెల్యే దాదాపు 700 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ప్రతిభను గుర్తించడం అభినందనీయం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ రవినాయక్ అన్నారు. బుధవారం ఆయన చాంబర్‌లో క్లాస్‌మేట్ క్లబ్ తరపున మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని 18 పాఠశాలలు, హన్వాడ మండలానికి చెందిన 2 పాఠశాలల్లో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,116 నగదు, సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దత్తు, శ్రీనివాసులు, మురళీకృష్ణ, ఎంఈఓ జయశ్రీ పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే భవిష్యత్

అడ్డాకుల: బాలబాలికలు చదువులపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్‌ఐ మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు విజయానంద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మహమ్మదాబాద్, జూలపల్లి, నంచర్ల, గాధిర్యాల్, చౌదర్‌పల్లి పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానానికి స్వస్తి పలికి వెంటనే పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

మిడ్జిల్: మండలంలోని రాణిపేట్ సమీపంలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై బుధవారం మధ్యాహ్నం బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న అయ్యవారిపల్లికి చెందిన కాటికె యాదమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. బైక్‌ను ఢీకొట్టిన కారు తప్పించుకుని కల్వకుర్తి వైపు పోవడంతో సీసీ ఫుటేజ్‌లను టోల్‌గేట్ వద్ద పరిశీలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు అభినందన

మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం ఎస్పీ నర్సింహ అభినందించారు. భవిష్యత్ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే అసోసియేషన్ ఫౌండర్ వెంకటేష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో కటాస్ విభాగంలో రూప, సుజన, లాంగ్‌వెపన్ విభాగంలో మనిస్విని ప్రథమస్థానంలో నిలిచారన్నారు.

జీఓలు విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తూ వెంటనే జీఓలు విడుదల చేయాలని జేఏసీ జిల్లా చైర్మన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌ఓ రవికుమార్, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీఓ వరలక్ష్మికి వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రితో జరిగిన చర్చల ఫలితంగా 15 డిమాండ్లలో 13కు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వేతనాలను పెంచుతామని ప్రకటించడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించామన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మహమ్మదాబాద్: మారుమూల గిరిజన తండాలో పుట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని మరిన్ని ఉన్నత పదవులను దక్కించుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సంగాయపల్లితండాకు చెందిన ప్రభునాయక్ కూతురు హిమబిందు ఇటీవల ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడంతో బుధవారం ఆమెను అభినందించారు.

జిల్లా జట్టు ఓటమి

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ టుడే లీగ్ చాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లో జిల్లా జట్టు 193 పరుగుల తేడాతో భారీ పరాజయాన్ని చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహమూద్ క్రికెట్ క్లబ్ జట్టు 413 పరుగులు చేయగా.. బుధవారం రెండోరోజు బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 50.5 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో కాశీం 54, షాదాబ్ 45, శ్రీకాంత్ 40 పరుగులు చేశారు.

వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: చోరీకి యత్నించిన వ్యక్తికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఏప్రిల్ 1న జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ ఏరియాలో నందుకు చెందిన ఫ్రేమ్ వర్క్ దుకాణంలో గోప్లాపూర్‌కు చెందిన శ్రీకాంత్ చోరీకి ప్రయత్నించాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం ఈ కేసు కోర్టుకు రావడంతో న్యాయమూర్తి శ్రీదేవి శ్రీకాంత్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కోర్టు ఆదేశాలతో శ్రీకాంత్‌ను వన్‌టౌన్ పోలీసులు జైలుకు తరలించారు.

కరెంట్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి


సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జడ్చర్ల: కరెంట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి పెద్ద ఆదిరాల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు బుధవారం కొండేడు వద్ద గల సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. వ్యవసాయ రంగానికి 6 గంటలు విద్యుత్‌కు మించి సరఫరా కావడం లేదని వారు తెలిపారు. వరి, ఇతర పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. గ్రామం, తండాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫీడర్‌ను కూడా ప్రారంభించకపోవడంతో తమ సమస్యలు అలాగే ఉండిపోయావని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కృష్ణాబాయి, గాంగ్యనాయక్, వార్డు సభ్యులు హరిబాబు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం గడువు పెంచాలి

జడ్చర్ల టౌన్: గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ఈనెలాఖరు వరకు గడువు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చే రూ.3లక్షలను సైతం రూ.5లక్షలకు పెంచాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజులే గడువు విధించటం సరికాదన్నారు.

రేపు మెగా జాబ్‌డ్రైవ్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ తెలిపారు. అమెజాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెటిరో ఫార్మసి, ముత్తూట్ ఫైనాన్స్ లాంటి 9 సంస్థలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. 2019 నుంచి 2023 ఏడాదిల్లో డిగ్రీ చదివిన వారు కళాశాల సమావేశ మందిరానికి శుక్రవారం ఉదయం 11గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9949055604, 9553141962 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

మాజీ ఆర్మీ జవాన్లకు సన్మానం


కూచూర్‌లో ఆర్మీ జవాన్ల తల్లిదండ్రులను సన్మానిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: నాదేశం నా మట్టి (మేరి మట్టి మేరి దేశ్) కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2, 3, 4 ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

మహబూబ్‌నగర్ రూరల్: మేరి మట్టి మేరా దేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కోటానాయక్ తెలిపారు. అందులో భాగంగా బుధవారం చౌదర్‌పల్లిలో 75 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు.

నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో 80 మంది యువకులు ఆర్మీలో చేరడం గొప్ప విషయమని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మధుసూదన్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్ల తల్లిదండ్రులకు సన్మానం చేశారు.

పాలమూరు: క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ సైనికులను, మాజీ పోలీస్ ఉద్యోగులను, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం రావడంతో పాటు బ్రిటిష్ వారిని పారదోలినట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవర్ధన్‌రెడ్డి, పద్మజారెడ్డి, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: ఆజాదికా అమృత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో రిటైర్ ఆర్మీ అధికారి, కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు దశరత్ మాట్లాడుతూ దేశ సంరక్షణకై సరిహద్దుల్లో సైనికుల పాత్ర వెల కట్టలేనిదన్నారు. కార్యక్రమంలో రమేష్, చంద్రుడు, భాస్కర్, వెంకటయ్య, నరేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే తండాల అభివృద్ధి

రాజాపూర్: గిరిజన తండాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సాధ్యమైనదని మాజీ ఎంపీ మల్లురవి అన్నారు. బుధవారం మండలంలోని సింగమ్మతండాలో ఆయన పల్లెనిద్రలో పాల్గొన్నారు. అయనకు గిరిజనులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు గిరిజనతండాల్లో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వేల కిలో మీటర్లు భారత్‌జోడో యాత్ర చేశారన్నారు. ఉచిత హామీలు ఇచ్చి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో దుష్యంత్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, శంకర్‌నాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

జడ్చర్ల టౌన్: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మినాజ్, బుర్ల వెంకటయ్య, శ్రీనివాస్‌యాదవ్, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.


పెద్దగడ్డతండాలో మాట్లాడుతున్న మల్లురవి

గండీడ్: రాష్ట్రంలో యువకులకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది కాంగ్రెస్ పార్టీలోనే అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రితిక్‌రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, హరిందర్‌రావు, సాయిరెడ్డి, దామోదర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లాభాపేక్ష ఉంటేనే పనులు చేపడతారా?

భూత్పూర్: లాభాపేక్ష ఉంటేనే స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పనులు చేపడతారని, లాభాపేక్ష లేకుంటే పనులు చేపట్టరని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం గోప్లాపూర్ వద్ద రహదారిపై మరమ్మతు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి ఏర్పాటు చేసిన స్థలం పట్టాదారు హైకోర్టులో కేసు వేయడంతో రోడ్డు నిర్మాణం చేపట్టరాదని స్టే వచ్చిందని, ప్రభుత్వం తరుపున కోర్టులో పోరాడి రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల నుంచి శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారి గుంతలుగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతు చేయడానికి చొరవ చూపడం లేదన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ తరుపున కార్యకర్తలందూ డబ్బులు పోగు చేసి రెండురోజుల్లో రహదారి మరమ్మతు చేపడతామని మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, నవీన్ కుమార్, మహమ్మద్ సాధిక్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను విస్మరించిన ప్రభుత్వం

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనుల విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకోని పార్టీ పల్లె నిద్రలో భాగంగా మండలంలోని ఉంద్యాలతండాలో పర్యటించి తండావాసుల సమస్యలను తెలుసుకున్నారు.

బీజేపీ నాయకుల నిరసన

జడ్చర్ల టౌన్: ఎమ్మెల్యే అనుచరుడు కౌన్సిలర్ కుమ్మరి రాజుపై దాడిచేశారని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్‌పై దాడి చేసినా పట్టించుకోవడం నాయకులు ఖండించారు. నిరసన చేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. జిల్లా అధికార ప్రతినిధి సామల నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయటం ప్రతి ఒక్కరి హక్కుగా గుర్తించాలన్నారు.

మిడ్జిల్: బీజేపీ కౌన్సిలర్ రాజుపై బీఆర్‌ఎస్ నాయకుల దాడిని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నరేందర్, తిరుపతి, రామకృష్ణ, విష్ణు, రాఘవేందర్, అరవింద్, గోపి తదితరులు పాల్గొన్నారు.


మిడ్జిల్‌లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

9 మంది తహసీల్దార్లకు పోస్టింగ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పది రోజులుగా పోస్టింగ్ కోసం ఎదురు చూసిన తహసీల్దార్‌లకు ఎట్టకేలకు ఇచ్చారు. బుధవారం కలెక్టర్ రవినాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 16 మండలాలు ఉండగా, 11 మంది తహసీల్దార్లు ముసాపేట్‌కు బ్రహ్మంగౌడ్, గండీడ్‌కు నాగలక్ష్మి, బాలానగర్‌కు శ్రీనివాస్‌రెడ్డి, రాజాపూర్‌కు విద్యాసాగర్‌రెడ్డి, నవాబుపేట్‌కు మల్లికార్జున్‌రావు, హన్వాడకు కిష్యానాయక్, మహబూబ్‌నగర్ రూరల్ మండలంకు సుందర్‌రాజు, మిడ్జిల్‌కు రాజు, జడ్చర్లకు శ్రీనివాసులును కేటాయించారు. వీరు బాధ్యతలు తీసుకున్నారు. మిగిలిన 5 మండలాలకు ఎందుకు నిలిపారో తెలియాల్సి ఉంది. మహబూబ్‌నగర్ అర్బన్, భూత్పూర్, అడ్డాకుల, సీసీకుంట, కొకుంట్ల, మహమ్మదాబాద్ మండలాలకు కేటాయించాల్సి ఉంది. ఇందులో మహబూబ్‌నగర్ అర్బన్ హాట్ టాపిక్‌గా మారింది. ఎవరికి కేటాయిస్తారని ఆసక్తి నెలకొంది.

రక్తదానం సామాజిక బాధ్యత

మహబూబ్‌నగర్ క్రైం: సినీ హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు బుధవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదానం చేశారు. కార్యక్రమంలో నటరాజ్, సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు, చందు, భవాని శంకర్, అయ్యప్ప, సాయికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ హాజరై 50యూనిట్స్ రక్తం దానం చేశారు. కమాండింగ్ ఆఫీసర్ ఎస్.కె సింగ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణలో సామాజిక బాధ్యత చాలా ముఖ్యమన్నారు.

సామూహిక పారాయణం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం సామూహిక పారాయణం నిర్వహించారు. వాసవీ మాత సంగ్రహ జీవిత చరిత్ర ఇంటింటి పారాయణం ప్రారంభించి 40 రోజులు పూర్తి చేసి ఉదయం 11:30 గంటల నుంచి 12:30 గంటల వరకు మహిళలు పారాయణం చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు గొండ్యాల రాఘవేంద్రశర్మ, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత కీలకం

అడ్డాకుల: వ్యాధులు రాకుండా వర్షాకాలం, శీతాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతే కీలకమని మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య తెలిపారు. మండలంలోని ముత్యాలంపల్లి పాఠశాలలో బుధవారం ఆయూష్‌శాఖ ఆధ్వర్యంలో వర్షాకాలం వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆయుర్వేద మందులను అందజేశారు. విద్యార్థులకు తల్లిదండ్రులు తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే అవకాశం ఉందని చెప్పారు. ఆయుర్వేద మందులపై అపోహలను వీడాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆయూష్ కరదీపికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మిడ్జిల్: మండలంలోని భైరంపల్లికి చెందిన శ్రీశైలం బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈయన రెండో భార్య ఇటీవల వదిలి వెళ్లడంతోనే మనస్తాపంతో పురుగు మందు తాగినట్లు గ్రామస్తులు తెలిపారు.

వాహనదారులకు జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు న్యాయమూర్తి జరిమానా విధించారు. ట్రాఫిక్ పోలీసులు చేసిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో ఏడుగురు ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. వారందరిని బుధవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిర్మల రూ.17వేల జరిమానా విధించారు.

చెరువుకట్ట మరమ్మతుకు నిధులు

నవాబుపేట: మండలంలోని కేశవరావుపల్లిలో రైతులకు పొలాలకు వెళ్లే దారితో పాటు చెరువు కట్ట మరమ్మతుకు ఎమ్మెల్యే సొంతంగా రూ.5 లక్షలు వెచ్చించి రోడ్డును వేయించారు. చెరువు కట్ట సైతం బలహీనంగా ఉండటంతో మరమ్మత్తు చేసేందుకు డబ్బులు అందించారు.